# జ్వాల

ఏవో లోకంలోంచి ఎవరో పిలుస్తున్నట్టు అస్పష్టమైన ధ్వనులు. కళ్ళ ఎదుట చీకటిలా, వెలుతుర్లా ఆకాశాన్నీ, భూమినీ కలుపుతూ ఒకేఒక తెర. సరిగ్గా ఒక్కడుగు దూరంలోనే! ఆ తెర వెనక మరో కొత్త లోకం. ఆ లోకంలో అస్పష్టంగా కలగా పులగపు మాటలు. జీవి యీ భూమ్మీదకు రాబోతున్నప్పుడూ, యీ భూమ్మీంచి ఎగిరిపోతున్నప్పుడూ వినిపించినలాంటి శబ్దాలు. ఎవరూ కనిపించడంలేదు కాని, అతిదగ్గర్లోనే వున్న అలికిడి. అదృశ్యమై తమ మధ్యే తిరుగుతున్నట్టున్న భావనకూడా వుంది. నిజానికి వాళ్ళ కంఠాల్లో నీళ్ళ అడుగున మునిగిపోయి అరుస్తున్న వాడి గొంతూ, ప్రతిధ్వనించే కొండ లోయల్లోంచి పిలుస్తున్నవాడిగొంతూ తొంగి చూస్తున్నట్లనిపిస్తున్నాయి.

కలా, నిద్రా, తెలివీవున్న జాగ్రదావస్థ అది.

ఏదో మత్తుగా వెలుతురు కళ్ళముందు కదులుతోంది. లేత ఊదా రంగు కాంతి. మిట్టమధ్యాహ్నం నడినెత్తి మీద ఎర్రగా సూర్యుడు మండుతున్నప్పుడు సముద్రం అడుగున ఇసుకమీదకు చేరిన రంగువంటి కాంతి.

మండుతున్న వస్తువుమీద అర్ధచంద్రాకారంలో చేరిన చల్లటి జ్వాలరంగు. ఆ రంగులో మత్తూ, బద్ధకమూ వుంటాయి. చల్లదనం వుంటుంది. కాని, ఏమిటో యిది చల్లగాలేదు. గోరువెచ్చగా వుంది. ఊదారంగు చిక్కబడి, అందులో పలచగా కలిసిన నీలం పరావర్తనమై ఎరుపురంగుమాత్రం మిగిలిపోయినట్టుంది. ఎర్రగా వుంది. ఎరుపుకూడా కాదు. కాషాయరంగు. కొద్దిసేపట్లో అందులోంచి పసుపురంగు విడివడిపోయి, అప్పుడు ఎరుపు రంగు మిగిలింది. రక్తంలాంటి ఎరుపు. కాలికాలి సాయంకాలానికి ఎర్రబడిపోయిన సూర్యగోళం రంగు. పండిన కుంకుమపూల పంటలా, ఆర్ద్రపురుగుల్లా— కోపం వెనక, కసి వెనక సలసల కాగుతోన్న రక్తంలా, ఆకలి మంటలా, మాతృమూర్తి పుత్రశోకంలా ఎర్రగా వున్న రంగు.

స్పర్శ స్పష్టంగా తెలుస్తోంది. వెచ్చగా తగులుతోంది. ఆ వెచ్చదనం వెలుతురిదికాదు; గాలిది. గాడ్పు కొడుతున్నట్టుంది. కాగుతున్న నీళ్ళల్లో మునిగినట్టుంది. ఉండేకొద్దీ వేడి ఎక్కువవుతోంది. జాగృదావస్థ దొర్లిపోతోంది. కళ్ళముందు భయంకరమైన విషనాగులు చాచిన అగ్నిశిఖలు. డ్రేగన్' వదిలిన నిప్పు సెగలు. క్షయరోగి కక్కుకున్న రక్తపు మడుగులా అంతటా ఎర్రటి మంటలు.

మంచంమీంచి చటుక్కున లేచాడు పుండరీకాక్షుడు. ఏమీ కనిపించడం లేదు. అతని చుట్టూ తెల్లటి పొగ సుడులు తిరుగుతోంది. అగ్నిశిఖల్నికూడా మింగేస్తూ భయంకరంగా పొర్లుకొస్తోన్న వెల్లువలా, దుఃఖంలా, చీకటిలా మీదమీదకు వచ్చేస్తోంది. మేఘాలమధ్య నిలుచున్నట్టుంది. సుడిగుండం మధ్య, సుడిగాలి మధ్య చిక్కుకున్నట్టు అతనికి ఊపిరి ఆడడంలేదు. ప్రాణం ఉక్కిరి బిక్కిరయిపోతోంది. పైకీ కిందకూ ఎగిరిపడుతోంది. కిటికీల్లోంచి, తలుపు సందుల్లోంచి, పై కప్పునుంచి దౌర్భాగ్యుడి దురదృష్టంలా తరుముకొస్తోంది పొగ. దట్టంగా గదినిండా అలుముకొంటోంది. వస్తువుల ఆకారాలమీద ముసుగులు కప్పుతోంది. అసలు ఏమీ కనుపించడంలేదు. మాయలో మునిగిపోతున్నట్టుంది. వస్తువు అస్థిత్వానికే ముప్పొచ్చినట్టుంది. చీకటితోకాక వెలుగుతో వస్తువుల్ని

మాయం చేస్తున్నట్టుంది. అప్పుడప్పుడు అగ్నిశిఖలు పొగల్లోంచి నాలుకలు చాచి వెక్కిరిస్తున్నాయి.

పుండరీకాక్షుడికి ఊపిరి గొంతులో గింజుకొంటోంది. కళ్లమంటలు పెడుతున్నాయి. నీరు కారుతోంది.

ఇదంతా కొద్ది క్షణాల్లోనే, ఆ కొద్ది క్షణాలూ అతనికేమీ తోచ లేదు. రాయిలా స్తంభించిపోయాడు. ఆ మరుక్షణం ఒక్క ఉరుకులో వెళ్ళి వీధి తలుపు తీశాడు. పొగ గుప్పున కళ్ళల్లో కొట్టింది. కళ్ళనిండా నీళ్లు చేరాయి. ఏమీ కనిపించడంలేదు. అంటుకుపోయి వూడిరావటంలేదు.

పక్క తలుపు తెరచుకుని ఎవరో వచ్చిన అలికిడి.

"ఏవండీ...ఏవండీ...!"

ఆవిడ—అతని భార్య జానకమ్మ!

"ఇటు... యిక్కడా... ఇలా......" గబ-గబా అతను ఎదు రెళ్ళాడు. కాలికి కుర్చీకోడు తగిలింది. దబ్బున కిందపడ్డాడు. తలకి మంచంపట్టీ కాబోలు తగిలింది. తల దిమ్మెక్కిపోయింది. తడుముకోడా నికి కూడా వ్యవధి లేదు.

ఆవిడ దగ్గరకొచ్చింది. లేవనెత్తింది.

"దెబ్బ తగిలిందా?"

"లేదు."

ఇద్దరూ కంగారుగా నడవాలోకి వెళ్ళారు. పుండరీకాక్షుడి తల్లి వుంది అక్కడ. పక్షవాతం. లేవలేదు. ఇంకా నడవాలోకి మంటలు వ్యాపించ లేదు. పొగమాత్రం కమ్ముకుంది. ఆవిడ ఒకటే కేకలు. ఇద్దరూ మంచం సాయంపట్టి వీధి వరండాలోకి తీసుకొచ్చారు.

ఈలోగా జనం ప్రహరీగోడ తలుపులు బాది, చివరకు గోడఎక్కి లోపలకు దూకారు. గొళ్ళెం తీసి ముసలావిడని బయటికి సాయంపట్టారు. కొంతమంది వెళ్ళి అందిన సామానంతా బయటకు తెస్తున్నారు.

ఆపాటికే జనం చాలామంది పోగయ్యారు. నిద్రపోతోన్న వూరు వూరంతా మేలుకొంది. అసలే అమావాస్య ముందు త్రయోదశి. దానికి తోడు అర్ధరాత్రి. అంతవరకూ గాఢాంధకారం తప్ప యింకేమీలేదు. ఆకాశంలో నక్షత్రాలు తమనితాము వెలిగించుకుని చూస్తున్నాయే తప్ప ఏకొద్దిపాటి వెలుతుర్నికూడా కిందకు వొదలడంలేదు. చిక్కటి చీకటి, కాటుకలా వూరంతా అలుముకుంది. ఊళ్లో తాటిచెట్లు పహరా కాస్తోన్న జవానుల్లా నిలుచున్నాయి. గాలి వుండి వుండి వాటిని ఒక్క కుదుపు కుదిపి వెళ్ళిపోతోంది. నిశ్శబ్దంగా వూరు నిద్రపోతోంది.

అలా నిద్రపోతూ కమ్మని కలలు కంటోన్న వూరు అకస్మాత్తుగా నిద్రలేచింది. ఎక్కడో ఏ వీధిలోనో ఓ కుక్క అరిచింది. ఇంకోచోట మరోటి. ఆ వెనకే జనం అరుపులు, కేకలు. నిశ్శబ్దాన్ని కత్తులతో చిదగ్గొడుతున్నట్టు చిటపటలు.

అక్కడకు చేరిన అందరి ముఖాలమీదా ఎర్రని నీరెండలాంటి కాంతి పడుతోంది. రక్తంపిండి చిలకరించినట్టుంది. ఆ కాంతి వెనక మంటలు నాలుకలు చాచుకుని చీకటిని కబళించేస్తున్నాయి. రక్తంతో తడిసిన నాలుకలవి. దప్పిక తీరక కనుపించిన వాటినన్నిటినీ కబళించేస్తున్నాయి. ఊరంతటినీ చుట్టుముట్టేంత కసితో ఎగురుతున్నాయవి.

గాలి రయ్‌మని వీస్తోంది. ప్రళయకాల విలయ నృత్యం చేస్తున్నప్పుడు విడివడ్డ శివుడి జటాజూటంలా నాలుకలు నలువైపులకూ ఎగిరి పడుతున్నాయి. తెరచుకున్న శివుడి మూడో నేత్రం ఎక్కడుందో తెలీడంలేదు. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతి. ఆ కాంతిని భరించలేక చూస్తోన్న కంటి గుడ్లు పగిలిపోయేట్లున్నాయి

ఆ మంటల్లోంచి కోడె త్రాచుల్లా పొగలు ఆకాశానికి లేస్తున్నాయి. పగబట్టిన పాముల్లా సర్రున లేచి, మెలికలు తిరిగి ఆకాశంలోకి చొచ్చుకుపోతున్నాయి. ఆకాశం మేఘావృతమయినట్లు పొగ అలుముకొంది. నక్షత్రాలు చీకటి సముద్రంలో మునిగిపోయాయి. పాముకాటు తిన్నదానిలా నక్షత్రాల వెలుగులతో నిండిన ఆకాశం నల్లబడిపోయింది. హంతకుడి

మనసులా వుంది ఆకాశం. ఇంకా అది తల విరబోసుకున్న స్త్రీలావుంది. ఏడ్చి-ఏడ్చి కాటుక చెదిరిపోయిన పసిపిల్ల ముఖంలా వుంది.

ఊళ్ళో జనమంతా అక్కడే వున్నారు. పిల్లా పీచూ అంతా ఒకటే సందడి___ ఏడుపులూ, అరుపులూనూ. ఒకరిమాట ఒకరికి వినిపించడం లేదు. గొంతు చించుకొని అరుస్తున్నారు. పొలికేకలు పెట్టి ఒకరినొకరు పిలుచుకొంటున్నారు. పసిపిల్లలు తల్లుల గుండెల్లో హత్తుకపోయారు. పిల్లకాయలు ముసలాళ్ళ వడుల్లో దూరిపోయారు. కాస్త ఊహ తెలిసిన వారు దూరం దూరంగా నిలుచుని బితుకుబితుకుగా చూస్తున్నారు.

ఉండి వుండి పొగ జనం కళ్ళల్లోకి కొట్టి వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వెచ్చటి గాడ్పు ముఖంమీద వడదెబ్బలా తగులుతోంది.అందరి ముఖాలూ మాడిపోయినట్టు నల్లబడిపోయాయి. గొంతులో తడారిపోయి నట్లు జనం పెదాల్ని నాలుకలతో తడుపుకొంటున్నారు.

ఎవ్వరూ స్థిరంగా నిలుచోడంలేదు. అటూ-యిటూ పరుగెడుతున్నారు. బిందెలతో నీళ్ళు కుమ్మరిస్తున్నారు. మంటలు వాళ్ళ ముఖాల్లో రక్తాన్ని పిండుతున్నాయి. రక్తంలో తడిసిపోయినట్లు ఎర్రబడిపోయారు వాళ్ళు. వాళ్ళ వెనక నీడలు దెయ్యాల్లా కదులుతున్నాయి.

చుట్టుపట్ల యిళ్ళ వాళ్ళు సామానుల్ని వీధుల్లోకి చేరేసుకొంటున్నారు. పూజా గదుల్లో, పారాయణ పుస్తకాల మధ్య పేజీల్లో మరిచిపోయిన దేవుడ్ని జ్ఞాపకం చేసుకుని లెంపలు వాయించుకొంటున్నారు. కొంతమంది మజ్జిగ తెచ్చి యిళ్ళ కప్పులమీద శాంతికై చల్లుతున్నారు.

అప్పటికప్పుడే నడి కొప్పుమీదకు మంట చేరింది. పాతకాలపు యిల్లది. వాసాలతో, వెదురు బొంగులతో అటుకు కూడా వుంది. కొన్ని వాసాలు పుచ్చిపోయాయి కూడాను. వాసాలు ఊకువి గాబోలు, నిలచి-నిలచి మరీ కాలుతున్నాయి.

నడవాకు కుడివైపునే పడగ్గది వుంది. అందులో చిల్లర-మల్లర సామాన్లు చాలా వున్నాయి. పెళ్ళి కాకముందు కూతురు ఆ గదిలోనే

వుండేది. ఇప్పుడు పుండరీకాక్షుడు పిల్లలకి ప్రయివేట్లు చెప్పడానికి ఆ గది ఉపయోగిస్తున్నాడు. ఆ గదిలో అట్టే ఖరీదయిన సామాను లేదు. అదంతా పడగ్గదిలోనే వుంది.

సరిగ్గా ఆ పడగ్గదిని ఆనుకునే వెనక వైపున వున్న చావిట్లో ఓ మూల తడకలతో ఏర్పాటు చేసిన వంట గది వుంది. అందువల్ల ముందుగా పడగ్గదికే మంట దెబ్బ తగిలింది.

"ఇప్పుడే వస్తాను. వుండు!" అంటూ భార్యతో చెప్పి పుండరీకాక్షుడు మీది మీదికొస్తోన్న పొగల్లోకి దూసుకుపోయాడు.

వరండాలోంచి నడవాలోకి వచ్చాడు. అగ్నిగోళం బ్రద్దలైనట్టు, రక్త వర్షం కురుస్తున్నట్టు ఎర్రగా మండిపోతోంది నడవా. నడవాలో చిలక్కొయ్యకువున్న బట్టలు రక్తంలో తడిపి, పిండి ఆరేసినట్టున్నాయి. పొగ అంతగా లేదు. మంట రాజుకునేవరకే పొగ, నల్లగా చీకటిలా మసి మాత్రం రాలుతోంది. అప్పుడప్పుడు ఒక్కొక్క వెదురుబద్ద మండుతూ కింద పడుతోంది.

కంగారులో పుండరీకాక్షుడు, కాలి కిందబడి నివురు కప్పుతూన్న వెదురు బొంగుమీద కాలేశాడు, చుర్రుమంది. 'అమ్మో' అన్నాడు.

ఆయనతోపాటు వెనక వస్తోన్న ఇద్దరు కంగారుగా ముందుకొచ్చారు.

"అబ్బే ఏమీలేదు, నిప్పు తొక్కాను" అన్నాడు.

ఆ యిద్దరూ నడవాలో సామాను ఒకరి కొకరు అందించుకొంటూ బయటికి చేరేస్తున్నారు.

పుండరీకాక్షుడు పడగ్గదిలోకి వచ్చాడు. ఆ గదిలోని బీరువాను బీరువా షాళంగా బయటికి తీయడం కష్టం. అందువల్ల తాళం తీసి అందులో సామాను నడవాలోకి చేరేస్తుంటే, వాళ్ళిద్దరూ వాటిని బయటికి పంపిస్తున్నారు.

పడగగదికి అటుకులేదు. అందువల్ల కప్పు కాలుతూన్నా మంట మాత్రం పెద్దదిగా లేదు ఏ ఆర్భాటం చెయ్యకుండా చాలా నిరాడంబరంగా కాలిపోతున్నట్లుంది.

ఎలాగయితేనేం సగం సామాను బయటికి చేరేశారు. ఆ పాటికే బాగా అలసిపోయారు. కాళ్లు బొబ్బలెక్కిపోయాయి. మంట దెబ్బ బాగా తగిలి ముఖం నల్లగా మాడిపోయింది. దానికి తోడు నల్లటి మసి, పొగ, నాలుగు వైపులనుంచి వెచ్చటి గాలి, కుమ్ములో పెట్టిన వంకాయలా ఒళ్ళంతా కుతకుత లాడిపోతోంది.

సామాను చేరేస్తున్న యిద్దరూ నడవాకు ఎడమవైపున వున్న గది లోకి చేరుకున్నారు. పూర్తిగా ఆ గదిలోకి మంటలు వ్యాపించలేదు. నడవాకు కుడివైపున వున్న పడక గదీ, చావిట్లోని తడికల వంట గదీ ఒకదాన్ని ఒకటి అనుకుని వున్నందువల్ల పడకగది ముందు అంటుకుంది. ఈ ఎడమవైపు గదికి మంటలు చేరాలంటే కొద్దిగా ఆలస్యం అవుతుంది.

వాళ్ళిద్దరూ ఆ గదిలోంచి కేకేస్తున్నారు పుండరీకాక్షుడ్ని వచ్చేసెయ్యమని. "ఆ సామాను యిక తియ్యలేం మాష్టారూ, మీరు ఇటొచ్చేసేయండి, దూలాలు విరిగి పడేట్టు వున్నాయి!" అన్నారు.

"ఇదిగో వచ్చేస్తున్నా!" అన్నాడు పుండరీకాక్షుడు.

కాని, ముఖ్యమైన పెట్టె ఒకటి వుండిపోయింది. అడుగు పెట్టె అది దానిపైన రెండు పెట్టెలు వున్నాయి. పై రెండింటిలోనూ పుస్తకాలు తప్ప మరేమీ లేవు. అడుగుదాంట్లో ఆవిడ తాలూకూ ఆభరణాలూ, ఒకటి అరా చొప్పున వెనకేసిన రెండువేల రూపాయలూ, పదివేలకు చేసిన యిన్స్యూరెన్సు పాలసీ వున్నాయి. ఏది తీసినా తియ్యకపోయినా ఆ పెట్టెను మాత్రం బయటికి తియ్యాలి.

పుండరీకాక్షుని మిత్రుడు, ఆ ఊళ్ళో డాక్టరు శేషగిరి అనే ఆయన వగర్చుకొంటూ లోపలకు వచ్చాడు. నేరుగా ఎడమవైపు గదిలోకి పోయి,

అక్కడినుండి నడవాలోంచి పడగ్గదిలోకి వచ్చి పుండరీకాక్షుడ్ని చూసి 'హమ్మయ్య' అనుకున్నాడు.

మిత్రుడ్ని చూసేసరికి శేషగిరికి భయమేసింది. ముఖమంతా తారు పూసుకున్నట్లుంది. నిద్రలో చెరిగిపోయిన తలమీద పైనుంచి బూడిద రాలి, పండిపోయి ముగ్గు బుట్టయిపోయినట్లుంది. బట్టలనిండా మసి. అక్కడక్కడ కాలినట్టు చిన్న చిన్న కన్నాలు కూడా వున్నాయి. కళ్ళల్లో ప్రతి ఫలిస్తోన్న జ్వాలలు లోపలి హృదయాన్ని చూపిస్తున్నాయి.

మిత్రుడ్ని చూడగానే "శేషగిరీ!" అన్నాడు. గొంతు బొంగురు పోయింది. మాట బైటికి రాలేదు. దుఃఖం కంఠంలో గూడుకట్టి ఆపేసింది. పిచ్చిగా గాజు కళ్ళతో చూసినట్లు, మిత్రుడి ముఖంలోకి చూశాడు. అంతటి వెచ్చని సెగల్లోనూ ఆ కళ్ళల్లో తడి కనిపించింది. ఆ తడి కన్నీటి తడిలా లేదు. రక్తపు తడిలా వుంది.

"ఏం చేస్తాం! ఇదంతా యిలా జరగాలని వుంది. సరే పద_ఒక వైపు పైనుంచి కాలుతోంటే యింకా ఇక్కడున్నావేమిటి? దూలాలు విరిగి పడతాయి!" అన్నాడు శేషగిరి.

"అడుగు పెట్లో డబ్బూ, వస్తువులూ అవీ వున్నాయి. దాన్ని కాస్త బయటికి చేర్చేస్తే..."

"సరే తియ్యి!" అన్నాడు శేషగిరి.

కాలుతున్న అడ్డబాజు ఒకటి విరిగి పందిరి మంచంమీద పడింది. పందిరి మంచంమీద వేసిన పరుపు కొబ్బరిపీచుది. పడీ పడడంతోనే అది అంటుకుంది. ఒక్కసారిగా మంటలు కిందనుంచి పైకి లేచాయి. పైకప్పు మీంచి కిందకు దిగిన మంటలు సరేసరి. పెట్టెలన్నీ పందిరిమంచం పక్కనే వున్నాయి. దగ్గరకు వెళ్తే మంటలు మీదకు ఉరుకుతాయి.

ఓ నిమిషం అలాగే నిలుచుని చూసి చివాల్న మంటల్లోకి దూరాడు పుండరీకాక్షుడు. గబగబా పై రెండు పెట్టెలూ దించి అడుగుపెట్టె ఈడ్చు

కుంటూ వచ్చాడు. చాలా బరువుగా వుందది. ఒక పట్టాన లాగితే రాలేదు. దానికితోడు పందిరి మంచం కోడి అడ్డుకుంది. అటూ యిటూ కదిపి, పక్కకు తప్పించి లాగితేగాని రాలేదు. జుత్తు కాలిందేమో యివతల నిలుచున్న శేషగిరికి గుప్పున వెంట్రుకలు కాలిన వాసన తగిలింది. భయపడి అతను కంగారుగా "పుండరీకం!" అంటూ పిలిచాడు.

"వస్తున్నా" అంటూ మంటల్లోంచి తల గోక్కుంటూ బయటికి వచ్చాడు అతను.

పుండరీకాక్షుడు ఆ పెట్టెను గడపదగ్గరకు లాక్కొచ్చి ఆగిపోయాడు. అప్పటికే అతను చెమటలు కక్కుతున్నాడు. ఆయాస పడుతున్నాడు. ముసలితనం వచ్చేసిన ఛాయలు స్పష్టంగా అతని ముఖంలో కనిపిస్తున్నాయి. ముఖంమీద విరిగిపోయిన ముడతలు, కారుతోన్న చెమట, ఎగిరి పడుతోన్న ముక్కుపుటాలు, కళ్ళల్లో అలసట—అన్నీ చూసేసరికి—నిజమే! పుండరీకానికి ముసలితనం వచ్చేసింది. నేనూ ముసలివాడ్నయిపోతున్నా నన్నమాట!" అనుకున్నాడు శేషగిరి. వొళ్లు జలదరించింది.

"ఒక్కడివీ మొయ్యలేవు. సాయంపడతానుండు" అంటూ వంగుని యివతలి వైపు కొక్కెం పట్టుకున్నాడు శేషగిరి.

ఇద్దరూ మోసుకుంటూ నడవాలోకి వచ్చారు. నడవానిండా నిప్పు కణాలు చెల్లాచెదురుగా పడున్నాయి. పైనించి పండిన పళ్ళలా వుండి వుండి ఒక్కో అగ్గిముద్ద రాలుతోంది రాలిన ఆ ముద్ద ముక్కలు ముక్కలై వెలుగు రవ్వల్లా నలువైపులకూ ఎగిరిపడుతున్నాయి. చిలక్కొయ్య మీద బట్టలు ఎప్పుడంటుకున్నాయో, కాలిపోయాయి. గోడ మీద పాములు పాకినట్టు నల్లటి చారలు ఏర్పడ్డాయి. పైనవున్న అటుకుతాలూకు తడిక పూర్తిగా కాలిపోయింది. నుసి అంతా కిందకురాలి ఎగురుతోంది. ఆకాశంలో పడగలెత్తి చీకటినిమింగిన విషనాగులు, మళ్ళీ ఆ నడవా నాలుగ్గోడల మధ్యా నల్లని బూడిదలాంటి చీకటిని కక్కుకుంటున్నాయి. తలుచుకొని తలుచుకొని మరీ ఏడుస్తున్న స్త్రీలా వుండి వుండి గుప్పున రాజుకుని ఎగురుతోంది మంట. అడ్డంగావున్న దూలం బాగా లావుపాటిది.

మంట పక్కవాసాలమీంచి మెల్లమెల్లగా పాకుకుంటూ వెళ్ళి దూలంమీదకు చేరి, పట్టుచిక్కక మళ్ళీ జారిపోతోంది. అరడజనుసార్లు ఓడిపోయి చివ రకు పట్టు చిక్కించుకుని విజయ గర్వంతో ఠీవిగా నిలిచింది.

ఇప్పటివరకూ ఆ దూలం ఆధారంగా వుండటంవల్ల కప్పు నిలిచి వుంది. ఇంకొద్ది సేపట్లో అది కూడా కాలిపోతే నడికొప్పుమొత్తం కూలి పోతుంది. ఈలోగా ఫైరింజన్లు వస్తే సరేసరి. లేకపోతే మొండిగోడలే మిగులుతాయి!

నడవాకు ఎడుమవైపు గదిలో సామాను తీస్తున్న యిద్దరూ మరో సారి పుండరీకాక్షుడ్ని హెచ్చరించి వెళ్ళిపోయారు.

శేషగిరి, పుండరీకాక్షుడూ ఇద్దరూ పెట్టెని సాయం పట్టుకొంటూ వస్తున్నారు. ఓ నిప్పు కణిక పెట్టెమీదపడి, అయిదు ముక్కలై పక్కలకు జారిపోయింది. ఓ ముక్క పుండరీకాక్షుడి మీదకు మళ్ళింది. చటుక్కున చెయ్యి లాక్కున్నాడు. పెట్టె కింద పడిపోయింది. శేషగిరి పట్టు కూడా జారిపోయింది. ఆ సమయంలో అతను పరధ్యాన్నంగా గోడ మీది ఫొటో వంక చూస్తూ వస్తున్నాడు. అనుకోకుండా వచ్చిన కుదుపుకు అతను కూడా వదిలేశాడు. దబ్బున పాదంమీద పడింది. పాదం చితికింది. "అబ్బా" అంటూ కేకపెట్టాడు.

పుండరీకాక్షుడు గబగబా పెట్టె పైకెత్తాడు. చివరి వేలు చిట్లి రక్తం కారుతోంది. మరీ ఎర్రగావుంది. ఆ రక్తం. నల్లటి నాపరాయి మీద ఒలికిన ఆ రక్తపు చుక్కలు మండిపోతోన్న నక్షత్ర గోళాల్లా వున్నాయి.

పెట్టెను అక్కడే వొదిలేసి శేషగిరిని నడిపించుకొంటూ బయటికి తీసుకొచ్చాడు పుండరీకాక్షుడు. దూరంగా నిలుచున్న జనం ఏమయ్యిందో అని పరుగెత్తుకొచ్చారు. పుండరీకాక్షుడు వట్టినే ఆర్భాటం చేస్తుంటే కోప్పడి "ఏమీ కాలేదు. వేలుకి కాస్త దెబ్బతగిలింది. యుద్ధంలో పని చేసి వచ్చినవాడ్ని, ఈ మాత్రం దెబ్బ ఓలెక్కలోదికాదు నాకు" అన్నాడు నవ్వుతూ శేషగిరి.

వాళ్ళిద్దర్నీ చూసి జానకమ్మ గబగబా నాలుగడుగులు ముందుకు వేసి ఆగిపోయింది. అక్కడనుంచి మరిక కదల్లేదు. చూస్తూ నుంచుండి పోయింది.

పుండరీకాక్షుడు గబగబా ఆమె దగ్గరకు వెళ్ళాడు. "శేషగిరికి దెబ్బ తగిలిందే. రక్తం కారుతోంది!" అన్నాడు.

ఆమె వినిపించుకున్నట్టు లేదు. మంటల్లోకి చూస్తోంది. ఆమె కళ్ళల్లో తగలబడిపోతోన్న యిల్లే ప్రతిఫలిస్తోంది.

"రక్తం ఎక్కువగానే కారుతోంది.ఏం చెయ్యాలిప్పుడు?"అన్నాడు తిరిగి.

"ఏం చెయ్యాలి! నాకేం తెలుసు_ఏం చెయ్యాలో .."అంది.

చటుక్కున తలెత్తి ఆమె ముఖంలోకి చూశాడు. ఆమె చూపుల్ని తప్పించేసింది.

"ఏదైనా గుడ్డపీలిక వుంటే ఇలా పడేయ్, అందాకా కట్టుఅయినా కడ్తాను" అన్నాడు.

"ఆయన డాక్టరు. ఆమాత్రం కట్టుకట్టుకోడం ఆయనకు చేతకాదనా మీరు కట్టడం!" అంది.

ఆ ధోరణి అతనికి బాగా అలవాటే.

అసలే అతనికి చికాకుగా వుంది. ఆమె సమాధానం మరీ చిందులు తొక్కించింది. కోపాన్ని అణుచుకోలేకపోయాడు. భార్య మీద చాలా అసహ్యం వేసింది.

"ఎందుకూ అతనంటే నీకంత కోపం! ఏం చేశాడని? మనగురించి వచ్చి కాలు చిదగ్గొట్టుకుంటే కనీసం సానుభూతయినా లేదేం నీకు!" అంటూ కసురుకుని వెళ్ళిపోయాడు.

శేషగిరి వద్దంటున్నా వినిపించుకోకుండా పంచె చించి కట్టుకట్టాడు.

మంటలు యింకా అలానే ఎగురుతున్నాయి. పక్కిల్లు కూడా అంటుకుంది. జనం అంతా పరుగెత్తారు. కనీసం ఆ యిల్లన్నా తగలబడకుండా చూడాలని విశ్వప్రయత్నాలూ చేస్తున్నారు. లోపల సామానేమీ లేదు. ఆ ఇంటివాళ్లు ముందే జాగ్రత్త పడ్డారు. నిచ్చెన్లు వేసుకుని జనం కాలుతున్న యింటి కప్పుమీదకు ఎక్కి బిందెలతో నీళ్లు కుమ్మరిస్తున్నారు.

పుండరీకాక్షుడు కాలుతున్న తమ యింటివైపు చూశాడు. విప్లవ బావుటాల్లా మంటలు ఎగురుతున్నాయి. యౌవనంలోని కోరికల్లాగ, పరాజయుని విద్వేషంలాగ, హంతకుడి మనసులాగ ఎగురుతున్నాయవి. పొగ పూర్తిగా తగ్గిపోయింది. మంట మాత్రం మిగిలింది. ఆ మంట ఇప్పుడు చూరువరకూ వచ్చేసింది.

"ఇక్కడే వుండు. వస్తాను!" అంటూ లేచి బయలుదేరాడు పుండరీకాక్షుడు.

"ఎక్కడికి...ఒద్దు...పుండరీకం! వెళ్లొద్దు...చాలా ప్రమాదం...పోతే పోయిందిలే సొమ్ము!" అంటున్నాడు శేషగిరి. అతన్ని ఆపుదామని లేచి, అతని వెనుకనే గబగబా వెళ్ళబోయాడు.

ఆ పాటికి అతని భార్యే వచ్చి అతని లాల్చీ పట్టుకుంది "ఒద్దండి! ...వెళ్ళొద్దు...ఈ డబ్బు మనల్ని ఉద్ధరించేదేమీలేదు. ఏ ఆపదా లేకుండా బయటపడ్డాం! అంతే చాలు..." అంది.

అతను విడిపించుకుని గబగబా కాలుతోన్న మంటల్లోకి వెళ్ళిపోయాడు. "ఏమండీ...ఏమండీ!" అని పిలుస్తూనే ఆవిడ కూడా అతని వెనకాలే నడవా వరకూ వెళ్ళి తలుపుదగ్గర ఆగిపోయింది.

నడవాలో, రాలి పడిపోయిన నక్షత్రాల్లా వున్నాయి నిప్పులు. కాలు పెట్టడానికి కూడా సందులేదు. పైన కాలడమేకాదు, కింద మూల మూలల్లోని కర్రసామాను కూడా అంటుకుని కాలిపోతోంది. గదంతా కమ్మరి కొలిమిలా వుంది.

నడవా మధ్యలో వుండిపోయింది పెట్టె. పుండరీకాక్షుడు జాగ్రత్తగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఆ పెట్టె దగ్గరకు వెళ్ళాడు. కొక్కెం పట్టుకొని ఇవతలికి లాగబోయాడు. చుర్రుమని అంటుకుంది. అప్పటి కప్పుడే వేడెక్కిపోయిందది. పంచె కుచ్చిళ్ళను మూడు నాలుగు మడతలు పెట్టి దానితో పట్టుకుని లాగాడు. కొద్దిగా కదిలింది. ఆ లెక్కన దాన్ని కదిపితే గుమ్మం దాటించేసరికి పావు గంటయినా పడుతుంది. ఈ లోపల......

ఆలోచిస్తున్న జానకమ్మ గతుక్కుమనిపోయింది. ఒకసారి మెళ్ళో మంగళసూత్రాల్ని బయటికితీసి కళ్ళకద్దుకుంది. గబగబా లోపలికెళ్ళి పవిట చెంగు మడతలతో అవతలి కొక్కెం పట్టుకుని "ఎత్తండి!" అంది.

ఇద్దరూ మెల్లగా దాన్ని మోసుకొస్తున్నారు. కింద నిప్పుల్ని తొక్కకుండా జాగ్రత్తగా ఆమె అడుగులు వేసుకొంటూ వస్తోంది. ఎంత పవిట చెంగుతో పట్టుకున్నా చెయ్యి కాలుతూనే వుంది ఆమెకు. చెయ్యి మార్చుకుంది.

దగ్గరకు వచ్చేశారు. గుమ్మం యింకెంతో దూరంలో లేదు. రెండు గజాలే.

అకస్మాత్తుగా మేఘం బ్రద్దలైన ధ్వని. క్షణంలో పిడుగులాగ విరిగిపడింది అడ్డు దూలం. ఆ పడడం తిన్నగా వచ్చి ఆవిడ మీదే పడింది!

ఒకే ఒక కేక. అంతే_ బోర్లా పడిపోయింది. వీపుమీద దూలం నిప్పులు కక్కుతోంది. బాగా లావుపాటి దూలం! ఎటూ కదలనీయకుండా అణిచిపెట్టేసింది. జానకమ్మ జుత్తు ముడి వూడిపోయి మండుతున్న దూలంమీద పడింది. పవిట మంటను అడ్డుతున్నట్టుగా కరకరలాడుతోన్న ఎర్రటి నిప్పుకణాల్ని కప్పేసింది.

శేషగిరి మళ్ళీ వెనక్కొచ్చి వెదురు కర్రొకటి పట్టుకొచ్చాడు. దూలం కిందపెట్టి, పెళ్ళగించి చూశాడు. కదలలేదు. మరో ముగ్గురువచ్చి సాయం పట్టారు. కొద్దిగా కదిలింది. మళ్ళీ దూలాన్ని పైకి పెళ్ళగించగానే కిందనుంచి శేషగిరి ఆవిడను బయటికి లాగేశాడు. కాలుతోన్న ఆ మంటను అలానే చేతుల్లోకి తీసుకుని ద్వారబంధం దగ్గరకొచ్చాడు. జనం నలుగురూ అందుకున్నారు. ఆర్పబోతే మంట వెంటనే ఆరలేదు. ఎవరో దళసరి జంబుఖానా తెచ్చి. ఆమెకు చుట్టి మంటల్ని లేవనీయకుండా కప్పేశారు.

అప్పటికే ఆమె చాలా భయంకరంగా తయారయ్యింది. జుత్తంతా కాలిపోయింది. వీపు ఎర్రటి మాంసం ముద్దలా వుంది. పడినప్పుడు నొసలు చిట్లిపోయింది. జుత్తుమీంచి మంటలు నొసటిమీదకు పాకి, పగుళ్లు మరీ భయంకరంగా తెరచుకున్నాయి. ముక్కు కూడా చిదిగింది. అందులోంచి రక్తంకారి పెదాలమీద పడుతోంది. కళ్లు గాజుకళ్లలా అయిపోయాయి. వాటిలో తడిలేదు. చాలా భయంకరంగా వున్నాయవి. చీరకూడా సగం కాలిపోయింది.

జనం ఆవిడ చుట్టూ చేరిపోయారు.

శేషగిరి వాళ్ళందరినీ దూరంగా పొమ్మని ఆమెను మోసుకుంటూ బయలుదేరాడు తన డిస్పెన్సరీకు.

పుండరీకాక్షుడు ఒకటే ఏడుపు. "నేనే ఆవిడ్ని నిలువునా కాల్చేశాను శేషగిరీ! నా తప్పు దాహమే ఆవిడకు చిచ్చుపెట్టింది. నేను హంతకుడ్ని శేషగిరీ... హంతకుడ్ని!" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

అతన్ని వూరుకోబెట్టే ధైర్యం శేషగిరికి లేకపోయింది. ఇలాంటి భయంకరమైన దృశ్యాలు, హృదయ విదారకమైన సంఘటనలు అతను ఎన్నో చూశాడు. కాని...

శేషగిరి కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. అతను ఆపుకోవడానికి ప్రయత్నించాడుగాని లాభం లేకపోయింది.

శేషగిరి డిస్పెన్సరీ అక్కడికి మూడు ఫర్లాంగులు వుంటుంది. యుద్ధంనుంచి తిరిగి రాగానే పట్టణంలో వుండడం యిష్టంలేక పల్లెపట్టణమూ కాని ఓ మాదిరి వూరైన ఆ వూళ్ళో స్థిరపడిపోయాడు. పెళ్ళి చేసుకోలేదు. బ్రహ్మచారి. నలభై అయిదూ-నలభై ఎనిమిదీ మధ్య వుండొచ్చు వయసు.

డిస్పెన్సరీకి చేరగానే కాంపౌండరుకు కబురంపించి పిలిపించాడు. అతని సాయంతో కాలినచోట్ల ఒంటికి అంటుకుపోయిన బట్టల్ని జాగ్రత్తగా కత్తిరించి తీసేశాడు. అంతకు ముందు ఒంటిమీద కాలిన పొక్కులులేవు. ఇప్పుడు చూస్తే మొఖంనిండా, మెడనిండా, భుజాలమీంచి అరచేతుల పైవరకూ అన్నీ పొక్కులే- వేలు ఆన్చడానికికూడా ఖాళీలేకుండా వున్నాయి. మంట దెబ్బ బాగానే తగిలింది. ఎడమకన్ను గుడ్డు కాస్త ముందుకు పొడుచుకొచ్చినట్టనిపిస్తోంది. చెవులు రెండూ బాగా కాలిపోయి [illegible] కుంచించుకుపోయాయి. కుడిభుజం, కిందకు జారిపోయినట్టుంది. [illegible]న్న దూలం ముందుగా భుజంమీద పడి, అక్కడనుండి వీపుమీదకు జారివుండాలి. స్పృహలేదామెకు. ఊపిరి తీస్తోంది కాని బరువుగా వస్తోంది.

పుండరీకాక్షుడు భార్యవైపు చూడలేకపోయాడు. బయటి గదిలోకి వచ్చి అటూ-ఇటూ పచార్లు చేస్తున్నాడు. మధ్యమధ్య చివాల్న లోపలికి వెళ్ళి, మళ్ళీ నిలవలేక బయటికి వచ్చేస్తున్నాడు.

అప్పుడప్పుడు శేషగిరి కత్తిరితో చర్మాన్ని కత్తిరించడమూ, మందు రాయడమూ, కట్లు కట్టడమూ, ఆ సమయంలో శేషగిరి చేతుల్లోంచి జారి సీసా పగలడమూ, అతని వేళ్ళల్లోని వణుకూ, కళ్ళల్లోని ఆతృతా, మాటిమాటికీ పెదాల్ని నాలికతో తడుపుకోడమూ పుండరీకాక్షుడు చూస్తూనే వున్నాడు.

పుండరీకాక్షుడు పడమటివైపున్న కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

భార్య తెలివిలో వుంటే యిక్కడకు రావడానికి ఒప్పుకునేదికాదు. శేషగిరి అంటే ఆమెకు పడదు. వాళ్ళ వూరివాడే. అతని తండ్రి మందు

పెట్టి భార్యను చంపేశాడట. తాత, కొట్లాటలో జైలుకెళ్ళి ఆరేళ్లున్నాడట. అయితే కావచ్చుకాని, శేషగిరి స్వతహాగా మంచివాడు. అతనికి తనంటే విపరీతమైన అభిమానం. ఎన్నో విషయాల్లో తనకు సాయపడ్డాడు. ఈ హెడ్‌మాష్టరు ప్రమోషను రావడానికి కారణంకూడా అతనే. రెండేళ్ళ కిందట అమ్మాయి పెళ్ళికి నాలుగువేలు అప్పిచ్చాడు. నోటన్నా వ్రాయించుకోలేదు. వడ్డీ అక్కరలేదన్నాడు. పదిహేనేళ్ళకిందట మొదటిసారి క్లబ్బులో పరిచయమయ్యాడు. తర్వాత సన్నిహితుడై పోయాడు. ఈ పదిహేనేళ్ళలోనూ తమ స్నేహం చాలా గాఢంగా పెనవేసుకు పోయింది. బంధువులా అయిపోయాడు. కాని ఒకటే బాధ. జానకి అతని మంచి తనాన్ని అర్థం చేసుకోలేదు. చేసుకుందామని ప్రయత్నించలేదు. శేషగిరి తమ్ముడి కొడుక్కి తన కూతుర్నిచ్చి పెళ్ళి చేద్దామనుకుంటే పడనిచ్చింది కాదు. "ఖూనీకోరుల వంశం అది. ఆ కొంపలో నా కూ[illegible]పడేసి, దాని గొంతు నేను కొయ్యలేను" అని ఖచ్చితంగా చె[illegible]. ఎప్పుడూ జానకికి అనారోగ్యమే. ఒకసారి ప్రాణం మీదకు వ[illegible]శేషగిరి డిస్పెన్సరీలో చేర్పించాడు. అర్ధరాత్రి తెలివి వచ్చాక, అంత జబ్బులోనూ బండి కట్టించుకుని యింటికి వచ్చేసింది– అక్కడ వుండలేనని. మరో హాస్పిటల్లో చేర్పించాడు.

దూరంగా ఫైరు సర్వీసు కారు గంటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. ఉండేకొద్దీ నిశ్శబ్దం దానికింద నలిగిపోతోంది. భయంకరంగా మోగుతున్నాయవి. చావుతర్వాత మోగుతోన్న చర్చి గంటల్లా వున్నాయి.

అంతా అయిపోయాక వస్తోంది కారు. ఈపాటికి అక్కడ మొండి గోడలూ, ఎండు బూడిదా తప్ప యింకేమీ మిగలవు.

జనం చాలామంది వచ్చారు "ఎలా వుందీ...ఎలా వుందీ:" అనుకుంటూ. చాలాసేపు కాసుక్కూర్చుని మెల్లగా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు, ఇద్దరో ముగ్గురో మిగిలారు.

మళ్ళీ మెల్ల మెల్లగా వూరు నిద్రలో పడుతోంది. అస్తమిస్తోన్న సామ్రాజ్యంలా, పడమటి వైపున ఆకాశంలో అంతవరకూ అలముకున్న

ఎర్ర రంగు మాయమై చీకటి వ్యాపిస్తోంది. గంటల కారు మంటల్ని ఆర్పేసి వెళ్ళిపోతున్నట్టుంది. శబ్దం దూరమైపోతున్నట్టు సన్నబడి నిశ్శబ్దంలో కలిసిపోయింది. మళ్ళీ చీకటి! నిశ్శబ్దం!!...

శేషగిరి బయటికి వచ్చి "ఒకసారి యింటి దగ్గరకెళ్ళి సామాను చూసుకుని రాగూడదూ! ముసలామె ఒక్కర్తీ వుందక్కడ!..." అన్నాడు.

'అలానే' అన్నట్టు పుండరీకాక్షుడు తలూపి, అక్కడనుంచి కదలి వెళ్ళబోతూ ఆగిపోయి "ఎలా వుందామెకు, ఫరవాలేదు కదా?" అన్నాడు.

మిత్రుడి కళ్ళలోని ఆందోళనను శేషగిరి భరించలేక పోయాడు. సూటిగా అతనివైపు చూడలేక దృష్టి మార్చుకుని "ప్రయత్నిస్తాను. శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాను. ఆ తర్వాత ఆ దేవుడి దయ!..." అన్నాడు. "అర్థమయ్యింది శేషగిరీ అర్థమయ్యింది!" అంటూ ఉబికి వస్తోన్న దుఃఖాన్ని పెదాలతో బిగబట్టి, కళ్ళు తుడుచుకుని, తడబడుతూన్న అడుగులతో అరుగు దిగిపోయాడు.

చీకట్లో తడుముకుంటూ ఇంటిని చేరుకున్నాడు. జనం ఇంకా లాంతరు పట్టుకుని సామాను సరుతున్నారు. నీళ్ళు కాలువలుకట్టి పాముల్లా పాకుతూ ఎటో చీకట్లోకి వెళ్ళిపోతున్నాయి. తడిసిన బూడిదలోంచి అదో రకమైన వాసన ఎగురుతోంది.

కొడుకును చూడగానే గొల్లుమంది తల్లి. ఆమెకు ధైర్యం చెప్పడం చేతకాలేదు అతనికి. అక్కడినుంచి కదిలి కాలిపోయిన నడవాలోకి వెళ్ళాడు.

నడవా నాలుగుగోడల మధ్యనుంచీ ఆకాశం కనిపిస్తోంది. నక్షత్రాలతో, చిరిగిపోయిన జరీ పంచెలా వుంది ఆకాశం.

పుండరీకాక్షుడు లాంతరు పట్టుకుని విరిగిపడిన దూలాలమధ్య చిక్కుకున్న సామానుగురించి వెతుకుతున్నాడు. వదిలేసిన పెట్టెను జాగ్ర

తగా బయట పెట్టించాడు. తాళం తీసి చూసుకుని తృప్తిపడి, మళ్ళీ వచ్చి వెతుకుతున్నాడు.

సగం కాలిపోయిన భార్య ఫోటో బూడిదలో కనిపించింది. ఫ్రేము కాలిపోయింది, అద్దం లేదు. పగిలిపోయిన అద్దం ముక్కలు ఆ చుట్టూ చెల్లాచెదురుగా పడున్నాయి. ఫోటో తడిసి, వంకర పోయింది.

కేబినెట్ సైజు బస్ట్ ఫోటో అంది. ఎప్పుడో చిన్నప్పుడు హైస్కూల్లో చదువుకునే రోజుల్నాటి ఫోటో అట- అది!

పుండరీకాక్షుడు ఆ ఫోటో పైకి తీశాడు. తడిసిపోయిన ఆ ఫోటో మీద బూడిద అంటుకుపోయింది. పంచెతో పైన తుడిచాడు. వెనకవైపున వున్న బూడిద తుడుస్తున్నాడు. ఏవో అక్షరాలు వున్నాయి. లాంతరు దగ్గరకు తెచ్చాడు. అంత స్పష్టంగా కనిపించడం లేదు. వత్తి పెద్దది చేసి, ఓసారి కళ్ళజోడు సరిచేసుకుని యిండియన్ యింకుతో వ్రాసివున్న ఆ అక్షరాల్ని చదువుకున్నాడు.

"ప్రేమతో జానకికి—

శేషగిరి—1936"

***